క్లుప్తంగా

ప్రజల సమస్యలు పరిష్కరించాలి



బాన్సువాడ: నిత్యం వార్డుల్లో తిరుగుతూ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్‌కు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బాన్సువాడ మున్సిపాలిటీకి ఇన్నోవేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విభాగంలో ఉత్తమ అవార్డు రావడం అభినందనీయం అన్నారు. అవార్డును శనివారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, కమిషనర్ రమేష్ అందుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్, నాయకులు అంజిరెడ్డి, ఎజాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇదీ రోడ్డే..!



పెద్దకొడప్‌గల్: మండలంలోని చావునితండా నుంచి బురుగుపల్లి మీదుగా పెద్దకొడప్‌గల్ వెళ్లే రోడ్డుపై కంకర తేలి అధ్వాన్నంగా తయారైంది. కంకర తేలడంతో పాటు గుంత లు పడటంతో రోడ్డు వెంబడి వెళ్లాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బీటీ రోడ్డు వేసి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి



తాడ్వాయి: ప్రతి ఒక్కరైతు పీఎం కిసాన్ పథకం కోసం ఈకేవైసీ చేయించుకోవాలని ఎర్రాపహాడ్ క్లస్టరు ఏఈవో రాకేష్ సూచించారు. మండలంలోని ఎండ్రియాల్ గ్రామంలో శనివారం ఫేసియల్ యాప్ ద్వారా పలువురి రైతుల ఈకేవైసీ చేయించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నర్సిములు, రైతుబంధు అధ్య క్షుడు నవీన్‌రెడ్డి, రైతులు అశోక్, గంగారెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకంతో అధిక లాభాలు



సదాశివనగర్: చేపల పెంపకం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని డీపీఎంలు రమేశ్ బాబు, సురేశ్, ఏపీఎం రాజిరెడ్డి సూచించారు. శనివారం మండలంలోని భూంపల్లి ఫిష్ ఫామ్‌పాండ్ వద్ద రైతులకు అవగాహన కల్పించారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



బాన్సువాడ: బాన్సువాడ పట్టణానికి చెందిన పలువురు యువకులు శనివారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి కాసుల బాల్‌రాజ్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షలు ఇవ్వనున్నట్లు అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మంత్రి గణేష్, గొల్ల వెంకన్న గుడాల నగేష్, కొట్టంల గంగాధర్ పాల్గొన్నారు.

రూ. 40 లక్షలతో కాజ్‌వే నిర్మాణ పనులు



బాన్సువాడ రూరల్: మండలంలోని తాడ్కోల్ గ్రామ శివారులోని అలుగు గడ్డ వాగుపై రూ. 40 లక్షలతో కాజ్‌వే నిర్మాణ పనులకు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. పనులు నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజమణి, ఎంపీటీసీ ఇందిర, సొసైటీ చైర్మన్ గంగుల గంగారాం, వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు పిట్ల శ్రీధర్, నాయకులు భూషణ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, కుమ్మరి రాజు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా గిరిజన దినోత్సవ వేడుకలు



మెల్లకుంట తండాలో సేవాలాల్ మహారాజ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ రాజ్‌దాస్

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా వ్యాప్తంగా గిరిజన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తండాల్లో గిరిజనులు సాంప్రదాయ దుస్తులు ధరించి పాటలు పాడుతూ నృత్యం చేశారు. తాడ్వాయి మండలంలోని పల్లెగడ్డా తండాలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ సునావత్ కొమిలితో కలిసి ఎంపీడీవో రాజ్‌వీర్, ఎంపీవో హెప్సీసారాణి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. లింగంపేట మండలంలోని ముంబోజీపేట తండా, శెట్పల్లి తండా, ఎక్కపల్లి తండా, బోనాల్ తండా, బాణాపూర్ తండా, నల్ల మడుగు తండా, పెద్ద తండా, జగదాంబ తండా, ఒంటర్‌పల్లి తండా, కొయ్యగుండు తండాల్లో సేవాలాల్, జగదాంబ మాత ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేసి భోగ్ బండార్ నిర్వహించారు.

నాగిరెడ్డిపేట మండలంలోని బెజుగంచెరువు తండా, పల్లెబొగుడ తండాలో ర్యాలీలు నిర్వహించారు. మెల్లకుంట తండాలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీపీ రాజ్‌దాస్, ఎంపీడీవో రఘు, ఎంపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు. ఎల్లారెడ్డి మండలంలోని కట్టకింది తండాలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ చాందీబాయితో కలిసి ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ ఉషాగౌడ్ పాల్గొన్నారు.

రాజంపేట: మండలం నడిమి తండాలో బోనాలతో ఊరేగింపుగా వెళ్లి జగదాంబ దేవికి సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వినోద్‌కుమార్, ఉప సర్పంచ్ షేర్‌సింగ్, కార్యదర్శి దేవలక్ష్మి పాల్గొన్నారు.



కట్టకింది తండాలో..



పల్లెగడ్డ తండాలో..



నడిమితండాలో..



క్యాసంపల్లి తండాలో..



జుక్కల్‌లో..



లింగంపేట మండలంలో..

ఇళ్ల వద్దకే పోడు భూముల పట్టాలు

ఎమ్మెల్యే జాజాల సురేందర్

గాంధారి: అర్హులైన గిరిజనులకు పోడు భూముల పట్టాలను ఇళ్ల వద్దకే తెచ్చిస్తామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం గాంధారిలో గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్, జగదాంబ దేవీ ఆలయం వద్ద నిర్వహించిన గిరిజన ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పలువురి లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. సంక్షేమ పథకాల అమల్లో దేశంలోనే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శంకర్ నాయక్, ఎంపీపీ రాధాబలరామ్ నాయక్, మాజీ జెడ్పీటీసీ తానాజీరావు, డీసీసీబీ డైరెక్టర్ సాయికుమార్, ఏఎంసీ చైర్మన్ సత్యం రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వజీర్ శివాజీరావు, మాజీ సింగిల్ విండో చైర్మన్ ముకుంద్‌రావు, సర్పంచ్ సంజీవు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులతో ఎమ్మెల్యే జాజాల సురేందర్

పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు

పెద్దకొడప్‌గల్: మండలంలోని కాటేపల్లి గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీతో తాగు నీరు కాలుషతమై అనరోగ్యలకు గురవుతున్న విషయమై 'లీకేజీలను అరికట్టండి' శీర్షిక ఈ నెల 14న సాక్షి దిన ప్రతికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేయించారు. సర్పంచ్ విఠల్ శనివారం దగ్గరుండి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించి నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకున్నందుకు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



కాటేపల్లి గ్రామంలో మిషన్ భగీరథ పైప్ లీకేజీ మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

పరిశ్రమ కంటే ప్రజల ప్రాణాలు ముఖ్యం

భిక్కనూరు: పరిశ్రమ కంటే ప్రజల ప్రాణాలు ముఖ్యమని బీజేపీ నియోజకవర్గం ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఎంఎస్ఎన్ పరిశ్రమ నుంచి విడుదలవుతున్న వ్యర్థాల నుంచి అనారోగ్యానికి గురవుతున్నారని వాటి నుంచి రక్షించాలని డిమాండ్ చేస్తూ కాచాపూర్ వీడీసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు శనివారం నాటికి 54వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి కాచాపూర్ నిరసన దీక్షలో కూర్చొని వారికి మద్దతు ప్రకటించారు. న్యాయం కోసం నిరసన దీక్షలు చేపడుతున్నా ప్రభుత్వం స్పందించక పోవడం శోచనీయం అన్నారు.ప్రజల ఆందోళనలో న్యాయం ఉందని పేర్కొన్నారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, నాయకులు గణేశ్‌రెడ్డి, శ్రీనివాస్,సిద్దు తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న వెంకటరమణారెడ్డి

21న పరిశ్రమ ముట్టడి..

భిక్కనూరు: ప్రజల ప్రాణాలను హరిస్తూ పర్యావరణాన్ని కాలుష్యం చేస్తున్న పరిశ్రమ యాజమాన్యం మెడలు వంచేందుకు 21న పరిశ్రమను ముట్టడిస్తామని కాచాపూర్ వీడీసీ అధ్యక్షుడు మైపాల్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముట్టడి కార్యక్రమానికి మండలంలోని ప్రతి ఇంటికీ ఒకరు చొప్పున తరలిరావాలని కోరారు.

ఎస్పీగా పదోన్నతి పొందిన అన్యోన్యకు సన్మానం



దోమకొండ: అడిషనల్ ఎస్పీ అన్యోన్యకు ఎస్పీగా పదోన్నతి లభించడంతో శనివారం దోమకొండకు చెందిన జాతీయ మానవ హక్కుల చైల్డ్ రైట్స్ స్టేట్ డైరెక్టర్ దాస్ ఎల్లం సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక అనాధ ఆశ్రమ నిర్వాహకులు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సేవకు సన్మానం



దోమకొండ: దోమకొండ ప్రభుత్వ ఆస్పత్రికి మూడు సార్లు కాయకల్ప అవార్డు రావడం అభినందనీయం అని జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, ఎంపీటీసీ నిమ్మ శంకర్, మండల కో ఆప్షన్ సభ్యులు షమీమ్ పేర్కొన్నారు. ఈ మేరకు వారు ఆస్పత్రి సూపరింటెండెంట్ సంగీత్‌కుమార్, వైద్యులు దివ్య, శ్రీవాణి, పద్మావతి, దీక్షిత్, నిఖిల్‌ను సన్మానించారు.

రేపటి వరకు పాలిటెక్నిక్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాలలో శనివారం పాలిటెక్నిక్ ప్రవేశాలకు సంబంధించి అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభమైంది. అన్ని జిల్లా కేంద్రాల్లో వివిధ ప్రవేశాలకు ధ్రువపత్రాల పరిశీలన శాశ్వత కేంద్రాలను ప్రారంభించింది. సోమవారం వరకు పాలిసెట్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మునేశ్వర్ చంద్రకాంత్ తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన అభ్యర్థులు తమకు నచ్చిన కళాశాలల్లో ప్రవేశానికి సంబంధించి ఈనెల 21వ తేదీవరకు ఆన్‌లైన్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఆప్షన్లు ఇచ్చిన వారికి సీట్ల అలాట్‌మెంట్ ఈనెల 25న జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సెలింగ్ కేంద్రం బాధ్యు లు అజహరొద్దీన్, సహాయకులు అనిల్‌కృష్ణ, ఆఫ్రీన్‌ఫాతిమా, కనకరాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందజేస్తున్న పాలిటెక్నిక్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రకాంత్

సర్వర్ డౌన్ పేరుతో కాలయాపన

- కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తుదారుల ఆందోళన
- బిచ్కుందలో తహసీల్దార్, డీటీ లేక సమస్య మరింత జటిలం
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

బిచ్కుంద/కామారెడ్డి టౌన్/పెద్దకొడప్‌గల్: సర్వర్ డౌన్ పేరు చెప్పి కుల, ఆదాయ సర్టిఫికెట్లు ఇవ్వకుండా దరఖాస్తుదారులను రెవెన్యూ అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కులవృత్తుదారులకు రూ. లక్ష ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని అందుకు కుల, ఆదాయ సర్టిఫికెట్లు జత చేయాలని ప్రభుత్వం వెల్లడించిన విషయం తెలిసిందే. దీంతో వేలాది మంది ఆశావహులు కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసి వారం రోజులు గడుస్తున్నా రెవెన్యూ అధికారులు సర్టిఫికెట్లు జారీ చేయకపోవడంతో దరఖాస్తుదారులు బిచ్కుంద, కామారెడ్డి తహసీల్దార్ కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. దీనికి తోడు విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో వివిధ కళాశాలల్లో చేరే విద్యార్థులు సైతం కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేయడంతో దిక్కు తెలియని పరిస్థితి నెలకొందని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. బిచ్కుందలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ ఇద్దరూ లేక పోవడంతో కొన్ని రోజులు పెద్దకొడప్‌గల్, బాన్సువాడ డిప్యూటీ తహసీల్దార్లకు, తర్వాత సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్‌కు ఇన్‌చార్జి బాధ్యలు ఇచ్చారు. అయితే వారు బాధ్యతలు తీసుకున్న కొన్ని రోజులకే ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పుకోవడంతో పరిస్థితి గందరగోళం నెలకొంది. రూ. లక్ష ఆర్థిక సాయం కోసం దరఖాస్తు గడువు 20వ తేదీతో ముగుస్తున్నందున లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. పెద్దకొడప్‌గల్‌లో సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన వారితో మీ సేవ కేంద్రాలు కిటకిటలాడాయి.



బిచ్కుంద తహసీల్దార్ కార్యాలయంలో ఆందోళన చేస్తున్న దరఖాస్తుదారులు

ఉన్నతాధికారులు స్పందించాలి..

కామారెడ్డి టౌన్: కుల, ఆదాయ సర్టిఫికెట్లను ఆలస్యం చేయకుండా వెంటనే జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ నాయకులు ఐరెని సందీప్, వడ్ల సురేష్, భరత్, రాహుల్, శ్యాంసుందర్, రంజిత్ తదితరులు ఆర్‌ఐ నవీన్‌కు వినతిపత్రం అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



బిచ్కుందలో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎంపీపీ

బిచ్కుంద/తాడ్వాయి/సదాశివనగర్: బిచ్కుంద లో ఏఎంసీ చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్‌తో ఎంపీపీ అశోక్ పలువురి లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. తాడ్వాయి మండలంలో వైస్ ఎంపీపీ నర్సింలు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మద్ద మహేందర్‌రెడ్డి పలువురికి చెక్కులు అందజేశారు. మండల కేంద్రమైన సదాశివనగర్‌కు చెందిన ఇద్దరు లబ్ధిదారులకు సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ బీరయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్ చెక్కులు పంపిణీ చేశారు.



తాడ్వాయిలో..

బెస్ట్ ప్లేయర్ అవార్డు



సౌమ్యరాణి

తాడ్వాయి:తైవాన్‌లో ఇటీవల జరిగిన ఏషియన్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో తాడ్వాయి బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న సౌమ్యరాణికి బెస్ట్ అవార్డు దక్కించదని పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీబాయి తెలిపారు. భారత్ జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించిన సౌమ్యరాణి అద్భుతమైన పనితీరును ప్రదర్శించినట్లు వెల్లడించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



ఎల్లారెడ్డి: పట్టణంలోని ఓపాఠశాలలో విద్యార్థులకు అటవీశాఖ అధికారులు శనివారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందించనున్నట్లు ఎల్లారెడ్డి అటవీశాఖ రేంజ్ అధికారి ఓంకార్ తెలిపారు.

పంచాయతీ భవన పనులు ప్రారంభం



తిమ్మారెడ్డి తండాలో జీపీ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ



జగదాంబ తండాలో..

ఎల్లారెడ్డి రూరల్: మండలంలోని తిమ్మారెడ్డి తండాలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ ఉషాగౌడ్ శనివారం సర్పంచ్ శ్వేతతో కలిసి భూమి పూజ నిర్వహించారు. రూ. 20 లక్షలు మంజూరైనట్లు తెలిపారు.

లింగంపేట: మండలంలోని జగదాంబ తండాలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి సర్పంచ్ పెట్యానాయక్ భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే జాజాల సురేందర్ చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిద్ధారెడ్డి, ఉప సర్పంచ్ సర్వన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దివిటి రమేశ్, కార్యదర్శి సౌమ్య, కారోబార్ శ్రీనివాస్, గంగారాం పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవన స్లాబు పనులు..

బీబీపేట: మండలంలోని యాడారం గ్రామంలో దళిత సంఘం భవన స్లాబు పనులను శనివారం బీజేపీ అసెంబ్లీ ఇంచార్జి కాటిపల్లి వెంకట రమణారెడ్డి ప్రారంభించారు. స్లాబుకు అవసరమైన నిధులను ఆయన ఇచ్చారని స్థానికులు తెలిపారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ మాధవి

ఎల్లారెడ్డిరూరల్: విద్యార్థులకు ఉపాధ్యాయులు సక్రమంగా బోధించాలని ఎంపీపీ మాధవి అన్నారు. శనివారం మండలంలోని కట్టకింది తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆమె పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉషాగౌడ్, సర్పంచ్ చాందీబాయి తదితరులున్నారు.

ఘనంగా ఊరడమ్మ పండుగ



భిక్కనూరులో గ్రామ దేవతలు

భిక్కనూరు: మండలం కేంద్రమైన భిక్కనూరులో ఊరడమ్మ పండగను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ దేవతలు ఊరడమ్మ, మహంకాళమ్మ, భూలక్ష్మమ్మలకు కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి ఒడి బియ్యంతో పాటు కట్న కానుకలు సమర్పించారు.

సంక్షిప్తం

ఇంటర్ పరీక్షలకు 71 మంది గైర్హాజరు

కామారెడ్డి టౌన్: ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలకు శనివారం 71 మంది గైర్హాజరు అయ్యారు. పరీక్షలను ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలా పర్యవేక్షించారు.

పాఠశాలలకు సెలవులు ఇవ్వాలి

నాగిరెడ్డిపేట: ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పాఠశాలలకు సెలవులు ప్రకటించాలని ఎంపీపీ రాజ్‌దాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆలోచించాలని కోరారు.

రైతులకు న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలం

రాజంపేట: రైతులకు న్యాయం చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జిల్లా రైతు సంఘం నాయకుడు మోహన్‌రెడ్డి అన్నారు. ధాన్యం కొనుగోలు చేసి నెలలు గడుస్తున్నా డబ్బులు ఇవ్వక పోవడం దారుణం అన్నారు.

భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డి: మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిపేట చెరువు శిఖం భూమి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. రెండు ఎకరాలకుపైగా భూమి కబ్జాకు గురైనట్లు వారు పేర్కొన్నారు.

రెండు నెలలు శుభ ముహూర్తాలు లేవు

కామారెడ్డి అర్బన్: రెండు నెలల పాటు శుభ ముహూర్తాలు లేవని విద్యానగర్ విశ్వనాథేశ్వరస్వామి ఆలయ అర్చకుడు శివకుమార్ తెలిపారు. ఆగస్టు 19 నుంచి శుభకార్యాలు నిర్వహించకోవచ్చని వెల్లడించారు.

ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి

బాన్సువాడ: ఆదివారం నుంచి అమలు చేస్తున్న టీ–9 రోజువారీ పాస్ కోసం రూ. 100 చెల్లిస్తే 60 కిమీ పరిధిలో ప్రయాణం చేయవచ్చని ఆర్టీసీ డీఎం సదాశివ్ తెలిపారు.

నందివాడలో ఉచిత వైద్య శిబిరం

తాడ్వాయి: నందివాడ గ్రామంలో కాంగ్రెస్ నియోజకవర్గం ఇంచార్జి సుభాష్‌రెడ్డి స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన కుల సంఘాల నేతలు

కామారెడ్డి రూరల్: మండలంలో తిమ్మక్‌పల్లి (కె) గ్రామానికి చెందిన మున్నూరుకాపు, ముదిరాజ్ సంఘం సభ్యులు శనివారం ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌ను కలిశారు. మున్నూరుకాపు కుల సంఘ భవనానికి రూ.3 లక్షలు, పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి రూ.4 లక్షలు మంజూరు చేసినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

బోరు బావి తవ్వకంపై ఘర్షణ

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామంలో బోరు బావి తవ్వే విషయంలో రెండవ వార్డుకు చెందిన వారితో సర్పంచ్ నర్సింలు యాదవ్ ఘర్షణకు దిగాడు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఇటీవల జంగంపల్లికి వచ్చినప్పుడు తాగునీటి సమస్యపై ఆయన దృష్టికి తెచ్చారు. విప్ ఆదేశాల మేరకు బోరు బావి తవ్వించేందుకు వాహనం రాగా రెండో వార్డులో కాకుండా మరోచోట బోరు వేయాలని సర్పంచ్ సూచించడంతో స్థానికులు ఆయనతో గొడవకు దిగారు.

దరఖాస్తు గడువు పొడిగించాలి

కామారెడ్డి రూరల్: కులవృత్తుదారులకు ప్రభుత్వం ఇవ్వనున్న రూ. లక్ష సహానికి దరఖాస్తు చేసుకునే గడువు పొడిగించాలని ముదిరాజ్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు డిమాండ్ చేశారు. 20న గడువు ముగుస్తున్నా చాలా చోట్ల అధికారులు సర్టిఫికెట్లు జారీ చేయలేదన్నారు.